నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, ఆదివారం 22 సెప్టెంబర్ 2024 | BHADRADRI KOTHAGUDEM

పరిశుభ్రత జిల్లాగా భద్రాద్రి

- పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత
- శ్రమదానంలో పాల్గొన్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

లక్ష్మీదేవిపల్లి, సెప్టెంబర్ 21 : ప్రతి ఒక్కరూ శ్రమదానం చేసి పరిశుభ్రత జిల్లాగా భద్రాద్రిని తీర్చిదిద్దాలని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అన్నారు. జిల్లాలో ఈ నెల 17వ తేదీ నుంచి చేపట్టిన స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాల్లో భాగంగా జిల్లా యువజన క్రీడలు, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖల ఆధ్వర్యంలో లక్ష్మీదేవిపల్లిలోని రామచంద్ర డిగ్రీ కాలేజీలో శనివారం నిర్వహించిన శ్రమదానం కార్యక్రమంలో కలెక్టర్ స్వయంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కళాశాలకు విశాలమైన ప్రాంగణం ఉన్నదని, ఇందులో కలెక్టర్ నిధుల నుంచి రన్నింగ్ ట్రాక్, హాకీ, వాలీబాల్ కోర్టు, స్విమ్మింగ్ పూల్, అన్ని రకాల క్రీడా సదుపాయాలు సమకూర్చుతామన్నారు. అలాగే కొత్తగూడెం, పాల్వంచ పట్టణాల్లో మహిళలు తడి, పొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ సిబ్బందికి అందజేయాలని, దీంతో ప్రభుత్వానికి సహాయపడిన వారవుతారని అన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విద్యాచందన, డీఎస్వో పరంధామరెడ్డి, పంచాయతీ అధికారి చంద్రమౌళి, విద్యాశాఖ నుంచి సైదులు, కాలేజీ ప్రిన్సిపాల్ వనజ, ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అధికారి వెంకటేశ్వర్లు, లక్ష్మీదేవిపల్లి ఎంపీడీవో బీవీ చలపతి, ఎన్ఎస్ఎస్ అధికారి పూర్ణచందర్, హాకీ కోచ్ ఇమాం పాల్గొన్నారు.

ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

కాల్వలు.. లీకేజీలు

- పాలేరు వద్ద మరమ్మతు చేసిన యూటీ పక్కన కూలిన వాల్
- ట్రయల్ రన్ నీటిని నిలిపివేసిన అధికారులు
- ఆదివారం రాత్రి వరకు నీరందిస్తాం : సీఈ విద్యాసాగర్

కూసుమంచి, సెప్టెంబర్ 21 : ఖమ్మం జిల్లా పాలేరు వద్ద సాగర్ కాల్వ యూటీ ప్రాంతంలో శనివారం లీకేజీ కావడంతో నీరంతా దిగువకు వెళ్తున్నది. దీనిని గుర్తించిన అధికారులు వెంటనే నీటి ప్రవాహాన్ని నిలిపివేసి మళ్లీ పనులు చేపట్టారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలతో సాగర్ ఎడమ కాల్వకు ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం హట్యాతండా వద్ద ఈ నెల ఒకటో తేదీన గండిపడిన విషయం తెలిసిందే. దానికి మరమ్మతులు చేసిన అధికారులు శనివారం నుంచి సాగు నీటిని విడుదల చేయాలని ఏర్పాట్లు చేశారు. అయితే క్రాస్ బండ్ వేసిన దానికి సమీపంలో కాల్వ వద్ద ఉన్న యూటీ పక్కన మరమ్మతులు చేశారు. నీటిని విడుదల చేసేందుకు బండ్‌ను తొలగించడంతో రెండు మీటర్ల మేర ఆగి ఉన్న నీరు యూటీ మధ్య వాల్ నుంచి ఒక్కసారిగా వెళ్లడంతో లీకేజీ పెద్దగా మారుతుందని భావించిన అధికారులు వెంటనే బండ్ వేసి నీటిని నిలిపివేశారు. దీంతో నీటి విడుదలకు మరో రోజు బ్రేక్ పడింది. వెంటనే మరమ్మతుల కోసం మళ్లీ పైపులు తెప్పించి సాయంత్రం పనులు మొదలు పెట్టారు. అయితే మరమ్మతు చేసిన ప్రదేశానికి పక్కనే యూటీ వాల్‌ను క్వాలిటీ కంట్రోల్ అధికారులు తనిఖీ చేసినా.. దానిని గుర్తించకపోగా దాని పైనే మరమ్మతులు చేయడంతో ధనం వృథా అయ్యింది. యూటీ వద్ద క్రాస్ బండ్ తీసిన వెంటనే నీరు బయటకు రావడంతో పాత కాల్వకు కడుతున్న సైడ్ వాల్‌కు నీటి ప్రవాహం రాకుండా అధికారులు ముందస్తుగా అప్రమత్తమయ్యారు. 1975లో కట్టిన యూటీ వాల్స్ పటిష్టత విషయంలో చర్యలు చేపట్టకపోవడం వల్లే మళ్లీ లీకేజీ అయినట్లు తెలుస్తోంది.


ఖమ్మం జిల్లా పాలేరు వద్ద సాగర్ కాల్వ యూటీ ప్రాంతంలో లీకేజీ

ఆదివారం రాత్రి వరకు నీరందిస్తాం.. : సీఈ విద్యాసాగర్

యూటీ వద్ద ఉన్న వాల్ 1975లో కట్టడం వల్ల దాని దగ్గరే సమస్య వచ్చింది. వెంటనే అప్రమత్తమై అడ్డుకట్టు వేసి నీటిని నిలిపివేశాం. ఆదివారం రాత్రి వరకు మళ్లీ నీటిని ఇస్తాం. కాల్వకు బుంగ పడినట్లు వస్తున్న వార్తల్లో నిజం లేదు. వాస్తవంగా మరమ్మతుల కోసం బండ్ వేశాం. బండ్ నీటిని తీయడంతో ఆ నీరు కాల్వలోకి వెళ్లి లీక్ కనిపించింది. పైపులు తెప్పించి సాయంత్రం నుంచి పనులు మొదలుపెట్టాం.

రూ.3.50 కోట్లు వర్షార్పణం

- 'పెదవాగు' మరమ్మతులకు కేటాయించిన నిధులు గంగపాలు
- పనులు కొనసాగుతుండగానే కొట్టుకుపోయిన రింగ్‌బండ్
- భారీ వర్షాల వల్ల జూలై నెలలోనే తెగిపోయిన ప్రాజెక్టు కట్ట
- గత కేసీఆర్ సర్కారులోనే రూ.1.20 కోట్ల నిధులు విడుదల
- ప్రాజెక్టు స్వాధీనంపై జీఆర్ఎంబీ అధికారుల దోబూచులాట
- ఆయకట్టులోని అశ్వారావుపేట రైతులకు దెబ్బ మీద దెబ్బ

అధిక వర్షాలు కురిసినా బోసిపోతున్న పెదవాగు ప్రాజెక్టు

ఇటీవల కొట్టుకుపోయిన రింగ్‌బండ్

అశ్వారావుపేట, సెప్టెంబర్ 21 : తెలుగు రాష్ట్రాల రైతులకు సాగు నీరు అందించే లక్ష్యంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం గుమ్మడవల్లి గ్రామ సమీపంలో నిర్మించిన పెదవాగు ప్రాజెక్టు ప్రస్తుత పాలకుల నిర్లక్ష్యానికి గురవుతోంది. దీంతో ఆయకట్టు రైతులు అధికంగా నష్టపోతుండగా.. ప్రజాధనం కూడా వృథా అవుతోంది. ఇటీవలి రెండు ఘటనలే ఇందుకు తార్కాణంగా నిలుస్తున్నాయి. జూలై నెలలో వచ్చిన భారీ వర్షాలకు ప్రాజెక్టు కట్ట తెగిపోయింది. ఆయకట్టు కింది అశ్వారావుపేట మండల రైతుల పొలాలను వరద ముంచెత్తింది. ఇసుక, రాళ్లు మేటలు వేసి కర్షకులను కోలుకోకుండా చేసింది. ప్రాజెక్టూ దెబ్బతిన్నది. సకాలంలో స్పందించి వెనువెంటనే నిధులు కేటాయించి పనులు మొదలు పెట్టాల్సిన సర్కారు.. మరికొంత ఆలస్యం చేసింది. ఫలితంగా మరో ఎదురుదెబ్బ తిగిలింది. ప్రజాధనం వృథా అయింది. ఆలస్యంగా నిధులు మంజూరు చేసి ఆ తరువాత మరమ్మతులు చేపట్టిన సమయానికి మరోసారి భారీ వర్షాలు ముంచుకొచ్చాయి. ఫలితంగా పనులు కొనసాగుతుండగానే రింగ్‌బండ్ మరోసారి కొట్టుకుపోయింది. దీంతో ప్రభుత్వం కేటాయించిన నిధులన్నీ వర్షార్పణమయ్యాయి. అలాగే, మొదటి వరదలకే మేటలతో భారీగా నష్టపోయిన రైతులకు.. తదుపరి సీజన్‌కు సాగు నీరు అందేది సందేహం కావడంతో వారికి కూడా దెబ్బ మీద దెబ్బ తగిలినట్లవుతుంది.

ప్రజాధనం వరదపాలు..

45 ఏళ్ల క్రితం నాటి పెదవాగు ప్రాజెక్టును గత కేసీఆర్ సర్కారు తప్ప ఇన్నాళ్లూ ఏ ప్రభుత్వమూ పట్టించుకోలేదు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వమూ అదేబాటలో నడుస్తోంది. భారీ వర్షాల వల్ల జూలై నెలలో ప్రాజెక్టు కట్ట కొట్టుకుపోయింది. వెనువెంటనే స్పందించి చర్యలు తీసుకోవాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణం స్పందించలేదు. ఆలస్యంగా మేల్కొని రూ.3.50 కోట్ల నిధులను కేటాయించింది. వాటితో చేపట్టిన రింగ్‌బండ్ పనులు కొనసాగుతుండగానే మరోసారి భారీ వర్షాలు వచ్చాయి. వాటి ధాటికి నిర్మాణ దశలో ఉన్న ప్రస్తుత రింగ్‌బండ్ కూడా కొట్టుకుపోయింది. దీంతో ప్రజాధనం వరదపాలైనట్లయింది. నిధులు మళ్లీ మంజూరు చేయాల్సి ఉండడం, పనులు మరోసారి మొదలు పెట్టాల్సి ఉండడంతో పరిస్థితి మళ్లీ మొదటికొచ్చినట్లయింది. రాష్ట్ర విభజన తర్వాత ఈ ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వం ఆధీనంలోకి తీసుకోవడం, నిధులు మంజూరు చేయకపోవడం, అటు ఆయకట్టు ఎక్కువగా ఉన్న ఏపీ ప్రభుత్వం కూడా నయా పైసా నిధులు ఇవ్వకపోవడం వంటి కారణాలతో ఇప్పటికే ఆ ప్రాజెక్టు అనాథలా మారింది. ప్రాజెక్టు మరమ్మతుల కోసం గత కేసీఆర్ సర్కారు వెచ్చించిన సుమారు రూ.1.20 కోట్ల నిధులు తప్ప మరే నిధులూ లేవు. ప్రాజెక్టును స్వాధీనం చేసుకోవడానికి గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (జీఆర్ఎంబీ) దోబూచులాడడంతో పెదవాగు ప్రాజెక్టు అభివృద్ధికి నోచుకోవడం లేదు.

సామర్థ్యానికి రెట్టింపు వరద..

ఉమ్మడి రాష్ట్రంలో అశ్వారావుపేట, వేలేరుపాడు, కుక్కునూరు మండలాల రైతులకు సాగునీరు అందించాలనే ఉద్దేశంతో అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు 1975లో ఈ ప్రాజెక్టును మంజూరు చేశారు. ఆ సమయంలో గడిచిన 30 ఏళ్ల తరువాతి వర్షపాతం, 40,500 క్యూసెక్కుల నీటి సామర్థ్యం అంచనాతో ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారు. 1981 నుంచి నిర్దేశించిన మండలాల రైతులకు సారునీరు అందుతోంది. ఈ ప్రాజెక్టు కింద సుమారు 16 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. అశ్వారావుపేట మండలంలో 2,360 ఎకరాల ఆయకట్టు ఉండగా.. మిగతాదంతా ఏపీలో విలీనమైన వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో ఉంది. కాగా, 40,500 క్యూసెక్కుల సామర్థ్యమున్న ఈ ప్రాజెక్టులోకి 88 వేల కూసెక్కుల నీరు వచ్చి చేరుతుండడం, ప్రాజెక్టు పటిష్టతపై రాష్ట్ర ప్రభుత్వాలుగానీ, కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని జీఆర్ఎంబీగానీ పట్టించుకోకపోవడం వంటి కారణాలతో అన్నదాతలే అన్ని విధాలా నష్టపోతున్నారు.

పెదవాగు ప్రాజెక్టు సమస్యను వివరిస్తున్న ఆయకట్టు రైతులు

గండి పూడ్చి.. సాగునీరివ్వండి : బాగం

కూసుమంచి, సెప్టెంబర్ 21 : గండిపడిన సాగర్ కాల్వకు మరమ్మతు చేసి వెంటనే పంట భూములకు సాగు నీరు అందించాలని రాష్ట్ర రైతు సంఘం(సీపీఐ అనుబంధ) అధ్యక్షుడు బాగం హేమంతరావు డిమాండ్ చేశారు. కూసుమంచి మండలం హట్యాతండా వద్ద కాల్వకు గండిపడిన ప్రాంతాన్ని శనివారం సంఘం నాయకులు పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ భారీ వర్షాలతో కాల్వకు గండిపడి 20 రోజులు అవుతుంటే.. 10 రోజుల క్రితం పనులు మొదలుపెట్టారని, దీంతో అధికారులు ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో అర్థమవుతుందన్నారు. మరమ్మతులు పనులు పూర్తి చేసి చివరి ఆయకట్టుకు నీరందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దొడపాటి రమేశ్, కార్యదర్శి కొండపరిత గోవిందరావు, నాయకులు జమ్ముల జితేందర్‌రెడ్డి, మిడికంటి వెంకటరెడ్డి, శివరామకృష్ణ, వెంకటేశ్వర్లు, రామారావు, రవి తదితరులు పాల్గొన్నారు.

పాలేరులో గండిపడిన సాగర్ కాల్వ ప్రదేశాన్ని పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

ఎన్నెస్పీ కార్యాలయం ఎదుట ధర్నా

సాగునీరు అందించాలని రైతు సంఘం డిమాండ్

కూసుమంచి, సెప్టెంబర్ 21 : ప్రస్తుత ఎండల తీవ్రతతో నీరందక ఎండిపోతున్న ఆయకట్టు భూములకు సాగర్ నీరు అందించాలని కోరుతూ రైతు సంఘం(సీపీఐ అనుబంధ) ఆధ్వర్యంలో రైతులు, పార్టీ నాయకులు నేలకొండపల్లి ఎన్నెస్పీ కార్యాలయం ఎదుట శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం బాధ్యుడు రచ్చా నర్సింహారావు మాట్లాడుతూ వారం రోజులుగా సాగర్ కాల్వ ఆయకట్టు కింద పంటలు ఎండిపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. పాలేరు కాల్వకు పడిన గండిని త్వరగా పూడ్చి రైతుల చివరి ఆయకట్టు భూములకు సాగునీరు అందించాలని కోరారు. అనంతరం కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం మండల కార్యదర్శి కేవీ రెడ్డి, నాయకులు ఏటుకూరి రామారావు, దుగ్గి వెంకటేశ్వర్లు, రైతులు పాల్గొన్నారు.

నేలకొండపల్లి ఎన్నెస్పీ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న రైతు సంఘం బాధ్యులు

అడ్డగోలుగా ఉద్యోగాల భర్తీ!

- నిబంధనలు పాటించని విద్యాశాఖ అధికారులు
- హడావిడిగా కేజీబీవీల్లో సీఆర్‌టీ, పీజీసీఆర్‌టీ ఖాళీల భర్తీ
- అర్హతలేని వ్యక్తితో సర్టిఫికెట్ల పరిశీలన
- అభ్యంతరాలకు అవకాశం లేకుండానే ప్రక్రియ పూర్తి
- అభ్యర్థులకు కనీస సౌకర్యాలూ కరువు

విద్యాశాఖ వివాదాలకు నిలయంగా మారుతున్నది. గతంలో జరిగిన ఘటనల నుంచి గుణపాఠాలు నేర్చుకోకుండా పదేపదే తప్పులు చేస్తున్నది. తాజాగా శనివారం కేజీబీవీల్లో ఉద్యోగాల ఖాళీల భర్తీకి సంబంధించి జరిగిన సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియలో నిర్లక్ష్యంగా వ్యవహరించింది. ఉద్యోగాల భర్తీలో అత్యంత అప్రమత్తంగా ఉండాల్సిన అధికారులు ఇష్టానుసారంగా ప్రక్రియను పూర్తిచేశారు. అవకతవకలు, ఆరోపణలకు ఆస్కారం లేకుండా నిర్వహించాల్సిన సీఆర్‌టీ, పీజీసీఆర్‌టీ ఖాళీల భర్తీలో నిబంధనలను తుంగలో తొక్కారు. సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరైన అభ్యర్థులకు కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయడంలోనూ విద్యాశాఖ పూర్తిగా విఫలమైంది.

– ఖమ్మం ఎడ్యుకేషన్, సెప్టెంబర్ 21

ఖమ్మం జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న సీఆర్‌టీ, పీజీసీఆర్‌టీ పోస్టుల భర్తీ ప్రక్రియను శనివారం ఖమ్మం నగరం పాత డీఈవో కార్యాలయంలో ఉన్న అర్బన్ ఎంఈవో కార్యాలయ వేదికగా నిర్వహించారు. సబ్జెక్ట్‌ల వారీగా సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహించేందుకు ఐదుగురు గెజిటెడ్ హెడ్‌మాస్టర్లను నియమించాలి.. కానీ విద్యాశాఖ అధికారులు నలుగురు గెజిటెడ్ హెడ్‌మాస్టర్లు, ఒక స్కూల్ అసిస్టెంట్‌తో ప్రక్రియను ముగించేశారు.

అర్హత లేని వ్యక్తితో సర్టిఫికెట్ల పరిశీలన

సబ్జెక్ట్‌ల వారీగా సర్టిఫికెట్ల పరిశీలన కోసం ఐదుగురు గెజిటెడ్ హెచ్ఎంలు కె.గాయత్రి (రాజేంద్రనగర్ జీహెచ్ఎస్, హెచ్ఎం), ఎస్.అజితకుమారి (బాలాజీనగర్ జడ్పీహెచ్ఎస్, హెచ్ఎం), బి.శివకుమారి (ఏదులాపురం జడ్పీఎస్ఎస్, హెచ్ఎం), జి.రమేశ్ (నేలకొండపల్లి జడ్పీహెచ్ఎస్, హెచ్ఎం), ఎం.రాజేంద్రప్రసాద్ (ఎన్ఎస్పీ జీహెచ్ఎస్, హెచ్ఎం)లను నియమించారు. అయితే ఇందులో గాయత్రి హాజరుకాకపోవడంతో నారాయణ(కాజీపుర జీహెచ్ఎస్, హెచ్ఎం)తో ఎలాంటి ఉత్తర్వులు లేకుండానే సర్టిఫికెట్ల పరిశీలన చేయించారు. ఇకపోతే.. రాజేంద్రప్రసాద్ స్కూల్ అసిస్టెంట్ కాగా.. ఎన్ఎస్పీ కెనాల్ పాఠశాలలో ఇన్‌చార్జి హెచ్ఎంగా పని చేస్తున్నారు. అధికారులు మాత్రం హెచ్ఎంగా పేర్కొంటూ గెజిటెడ్ ఆఫీసర్ హోదాలో సరిఫికెట్ల పరిశీలనకు నియమించారు. స్కూల్ అసిస్టెంట్‌తో సర్టిఫికెట్ల పరిశీలన చేయడంతో నిబంధనలను తుంగలో తొక్కినట్లు అయ్యింది.

సర్టిఫికెట్ల పరిశీలన గది వద్ద కుర్చీలు లేక నిలబడి ఉన్న అభ్యర్థులు

సర్టిఫికెట్ల పరిశీలన చేస్తున్న అధికారులు

అభ్యంతరాలకు అవకాశం లేకుండా..

ఉద్యోగాలను భర్తీ చేసే ప్రక్రియలో అధికారులు నియమ నిబంధనలను కచ్చితంగా పాటించాలి. తొలుత ప్రొవిజనల్ జాబితా ప్రకటించడం, తర్వాత అభ్యంతరాలకు అవకాశం ఇవ్వడం, తుది జాబితా ప్రకటించిన అనంతరం సర్టిఫికెట్ల పరిశీలన చేయాలి. విద్యాశాఖాధికారులు మాత్రం మొత్తం ప్రక్రియను రెండ్రోజుల్లోనే పూర్తిచేశారు. గురువారం రాత్రి జాబితాను ప్రకటించారు. గురువారమే జాబితాలో ఉన్న అభ్యర్థులకు శనివారం సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని సమాచారమిచ్చారు. 2023 పరీక్ష రాసిన అభ్యర్థుల్లో గతంలో ఎంపికైన వారిని కాకుండా తర్వాత మెరిట్ వారిని ఎంపిక చేసినట్లు విద్యాశాఖాధికారులు చెబుతున్నప్పటికీ కనీసం అభ్యంతరాలకు అవకాశం ఇవ్వలేదు. హడావిడిగా ప్రక్రియను పూర్తి చేశారని సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరైన అభ్యర్థులు బాహాటంగా ఆరోపిస్తున్నారు.

63 మంది హాజరు..

కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న పోస్టుల్లో 13 కేటగిరీలు ఉన్నాయి. స్పెషల్ ఆఫీసర్-1, సీఆర్టీ తెలుగు-2, సీఆర్‌టీ ఇంగ్లిష్-1, సీఆర్‌టీ గణితం-3, సీఆర్‌టీ ఫిజికల్ సైన్స్-3, సీఆర్‌టీ బయోలాజికల్ సైన్స్-1, సీఆర్‌టీ పీఈటీ-1, పీజీసీఆర్‌టీ తెలుగు-1, పీజీసీఆర్‌టీ ఇంగ్లిష్-7, పీజీసీఆర్‌టీ గణితం-2, పీజీసీఆర్‌టీ-కెమిస్ట్రీ-2, పీజీసీఆర్‌టీ జువాలజీ-4, పీజీసీఆర్‌టీ కామర్స్-1, పీజీసీఆర్‌టీ నర్సింగ్-9 పోస్టులు ఉన్నాయి. మొత్తం 38 పోస్టులను భర్తీ చేయాల్సి ఉంది. 1:3 నిష్పత్తి ప్రకారం 114 మందిని ఎంపిక చేయాలి. రోస్టర్ ప్రకారం కొన్ని విభాగాల్లో అభ్యర్థులు లేరని 92 మందిని ఎంపిక చేశారు. వారిలో శనివారం సర్టిఫికెట్ల పరిశీలనకు 63 మంది హాజరయ్యారు. అభ్యర్థులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో విద్యాశాఖాధికారులు విఫలమయ్యారు. కనీసం కుర్చీలు కూడా అందుబాటులో ఉంచలేదు. సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహిస్తున్న గది వద్ద గంటల తరబడి ఇరుక్కుని నిలబడి ఉండి సర్టిఫికెట్ల పరిశీలన చేయించుకున్నారు. ఈ ప్రక్రియలో డీఈవో కార్యాలయ సూపరింటెండెంట్ శ్రీధర్, జీఈసీవో తులసి తదితరులు పాల్గొన్నారు.

టీచర్లు, తల్లిదండ్రుల సమన్వయంతోనే

పిల్లలకు ఉజ్వల భవిష్యత్తు : ఖమ్మం కలెక్టర్

రఘునాథపాలెం, సెప్టెంబర్ 21 : తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పని చేస్తే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. శనివారం వీ వెంకటాయపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పేరెంట్స్ మీటింగ్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు మంచి భవిష్యత్తు అందించేందుకు ఉపాధ్యాయులు నిరంతరాయంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. పాఠశాలలో ఏది నేర్చుకున్నారో ప్రతిరోజు ఇంటివద్ద తల్లిదండ్రులు పరిశీలించాలని సూచించారు. పిల్లలు నిత్యం ఇంటి వద్ద చదివేలా చూడాలని సూచించారు. ప్రతి రోజు పాఠశాలలో ఇంగ్లిష్, స్పోర్ట్స్ ప్రత్యేక పీరియడ్ ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. అనంతరం పాఠశాల టాయిలెట్స్, వంట గది, ఆర్‌వో ప్లాంట్, కిచెన్ గార్డెన్‌లను పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీమన్నారాయణ, మాజీ ఎంపీటీసీ యరగర్ల హనుమంతరావు పాల్గొన్నారు.

పేరెంట్స్ మీటింగ్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

సర్కార్ బ్యాంక్‌లో భారీ కుంభకోణం!

- ప్రైవేట్ వ్యక్తితో లాలూచీ
- రూ.2 కోట్ల ప్రజా సొమ్ము దుర్వినియోగం?
- ఫిర్యాదుపై స్పందించిన ఉన్నతాధికారులు
- బ్యాంక్ మేనేజర్ సస్పెన్షన్
- గోప్యంగా కొనసాగుతున్న విచారణ
- బయటకు వస్తున్న బాధితులు

ప్రజా సొమ్ముకు భద్రత కల్పించాల్సిన బ్యాంక్ మేనేజర్ ప్రైవేట్ వ్యక్తితో లాలూచీ పడి దుర్వినియోగానికి పాల్పడ్డాడు. రుణమాఫీ వ్యవహారంతో వెలుగుచూసిన అక్రమ బాగోతంపై బాధితుల ఫిర్యాదు మేరకు ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. తక్షణమే సదరు బ్యాంక్ మేనేజర్‌ను సస్పెండ్ చేసి మరో మేనేజర్‌ను బ్యాంక్‌కు పంపించారు. అంతేకాకుండా బ్యాంక్‌లో చోటుచేసుకున్న అక్రమాలు, బాధితుల ఫిర్యాదుపై విచారణ జరిపిస్తున్నారు. రుణాల కుంభకోణంపై ప్రాథమిక నిర్ధారణకు వచ్చిన ఉన్నతాధికారులు క్షేత్రస్థాయి విచారణ కొనసాగిస్తున్నారు. గోప్యంగా జరుగుతున్న విచారణ ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రుణ కుంభకోణం సుమారు రూ.2 కోట్లకు పైగానే ఉంటుందని అంచనా వేస్తున్నారు. – అశ్వారావుపేట, సెప్టెంబర్ 21

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలంలోని ఓ సర్కార్ బ్యాంక్ ఖాతాదారులకు సులువైన సేవలు అందించేందుకు ప్రైవేట్ వ్యక్తిని బ్యాంక్ కో-ఆర్డినేటర్‌గా నియమించారు. ఈ వ్యక్తి సమీప బంధువు బ్యాంక్‌పై పెత్తనం చెలాయించాడు. ప్రభుత్వం అమలు చేస్తున్న ముద్ర, పీఎంఈజీపీ, పంట రుణాలపై కన్నేశాడు. బ్యాంకులో ఎటువంటి రుణాలు లేని రైతులు, చిరు వ్యాపారులు, నిరుద్యోగులకు వల వేశాడు. రుణాలు అవసరం లేని వారికి గుడ్‌విల్ ముట్టజెప్పి రుణం మొత్తం స్వాహా చేశాడు. రుణం అవసరమైన వారితో సగం వాటా ఇవ్వాలని అంగీకారం తీసుకున్నాడు. తాను తీసుకున్న రుణం తిరిగి తానే చెల్లించేలా ఒప్పందం చేసుకున్నాడు. కానీ కొన్ని వాయిదాలు చెల్లించిన తర్వాత చేతులెత్తేశాడు. దీంతో బాధితులు ఓడీ (ఓవర్ డ్యూ) జాబితాలోకి చేరడంతో బ్యాంకు నుంచి రుణ వాయిదాల చెల్లింపుపై వత్తిడి పెరిగింది. దీంతోపాటు ఇటీవల ప్రభుత్వం అమలుచేసిన రుణమాఫీతో రైతులు కంగుతిన్నారు. తాము ఎటువంటి రుణం తీసుకోకున్నా మాఫీ ఎలా అయ్యిందంటూ కూపీ లాగారు. అప్పుడు అసలు విషయం బయటపడింది. ఒక్కసారిగా ఉలిక్కిపడ్డ రుణ బాధితులు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశారు.

అక్రమాలకు ఆద్యుడు..

బ్యాంక్ కో-ఆర్డినేటర్ బంధువు రుణ అక్రమాల్లో ఆద్యుడిగా పేరొందాడు. రుణాల మంజూరు పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడ్డాడు. బ్యాంక్ ఖాతా ఉన్న వృద్ధులు, ఇతరులు థంబ్ ద్వారా నగదు తీసుకునే సమయంలోనే అధిక నగదు డ్రా చేసేవాడు. అతడు తన బంధువుకు బినామీగా బ్యాంక్ సేవలు అందిస్తూ ప్రజా సొమ్ము దోపిడీకి పాల్పడుతున్నాడు. గతంలోనే అనేక ఫిర్యాదులు ఉన్నప్పటికీ వారితో రాజీ చేసుకుని బ్యాంక్ ప్రైవేట్ ఉద్యోగాన్ని కాపాడుకుంటూ వచ్చాడు. కొంతకాలంగా బ్యాంక్ మేనేజర్‌ను ప్రలోభాలతో లొంగదీసుకుని రుణాల మంజూరులో కీలకంగా వ్యవహరించాడు. కొందరికీ ఏమీ తెలియకుండానే రుణాలు తీసుకుని స్వాహా చేశాడు. కొందరు ఖాతాదారుల సంతకాలు తీసుకుని దరఖాస్తు పూర్తి చేసి మేనేజర్ ద్వారా రుణాలు మంజూరు చేయించుకున్నాడు. ఇందుకు మేనేజర్‌కు నగదు రూపంలో ప్రతిఫలం ముట్టజెప్పినట్లు ప్రచారం జరుగుతోంది. కొంతకాలంగా జరుగుతున్న ఈ వ్యవహారంపై తోటి ఉద్యోగులు మేనేజర్‌ను హెచ్చరించినా పట్టించుకోలేదని తెలుస్తోంది.

బ్యాంక్ మేనేజర్ సస్పెన్షన్..

ప్రైవేట్ వ్యక్తితో లాలూచీ పడి అడ్డగోలుగా రుణాలు మంజూరు చేసి ప్రజా సొమ్ము దుర్వినియోగానికి పాల్పడిన బ్యాంక్ మేనేజర్‌ను ప్రాథమిక విచారణ ఆధారంగా ఉన్నతాధికారులు సస్పెన్షన్ చేశారు. బాధితుల నుంచి ఫిర్యాదులు ఎక్కువగా అందడంతో ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. విచారణలో బ్యాంక్ మేనేజర్ బంధువుల ఖాతాల్లోకి కొంత నగదు లావాదేవీలు జరిగినట్లు గుర్తించారు. రుణ కుంభకోణం భారీగానే ఉంటుందని భావించిన విచారణాధికారులు ఉన్నతాధికారుల ఆదేశాలతో క్షేత్రస్థాయిలో విచారణకు కొనసాగిస్తున్నారు. నలుగురు సభ్యుల బృందంతో వచ్చిన అధికారులు క్షుణ్ణంగా వివరాలు సేకరిస్తున్నారు. బాధితుల నుంచి లిఖిత పూర్వకంగా సమాధానాలు తీసుకుంటున్నారు. ఒక పక్క విచారణ జరుగుతుండగానే ఒక్కొక్కరిగా బాధితులు బయటకు వస్తున్నారు. మరోపక్క ఫిర్యాదులు చేస్తూనే ఉన్నారు. బాధితుల సంఖ్య రోజూ పెరుగుతుండడంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఈ విషయమై ప్రస్తుత బ్యాంక్ మేనేజర్ మాట్లాడుతూ విచారణ పూర్తి అయ్యిందని, నివేదిక అనంతరం తదుపరి చర్యలు ఉంటాయని 'నమస్తే తెలంగాణ'కు తెలిపారు.